క్లుప్తంగా

ఓటు హక్కుపై అవగాహన



మాట్లాడుతున్న మునిశేఖర్

ఏర్పేడు: తమ హక్కులను సాధించుకునేందుకు గిరిజనుల్లో రాజకీయ చైతన్యం రావాలని యువనేస్తం అసోసియేషన్ వ్యవస్థాపకుడు మునిశేఖర్ అన్నారు. ఆదివారం మండలంలోని రాజులపాలెం ఎస్టీ కాలనీలోని కార్యాలయంలో ఓటు హక్కు వినియోగంపై గిరిజనులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ నిరక్షరాస్యతతో గిరిజనులు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని సూచించారు. అసోసియేషన్ మండల కో–ఆర్డినేటర్లు అరుణ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ఉపాధి పనులు



పని చేస్తున్న కూలీలు

బుచ్చినాయుడుకండ్రిగ : ఉపాధి హామీ పథకం కింద మండల కేంద్రంలోని ఓటుగుంట పొలాలకు వెళ్లే రోడ్డు మరమ్మతు పనులు జోరుగా సాగుతున్నాయి. ఫీల్డ్ అసిస్టెంట్ హైమవతి మాట్లాడుతూ పొలాలకు వెళ్లే రోడ్డు మరమ్మతుల కోసం ఉపాధి నిధులు రూ. 4 లక్షలు మంజూరై అయ్యాయని తెలిపారు. రోడ్డుకు యిరువైపుల ఉన్న చెట్లు, పొదలను తొలగిస్తున్నట్లు చెప్పారు. 130 మంది కూలీలు పనిచేస్తున్నారని, కూలీలకు కూలి గిట్టుబాటు అవుతోందని తెలిపారు.

పలుగు, పార పట్టిన యువకులు



చెట్లు, పుట్టలను తొలగిస్తున్న యువకులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని వేణుగోపాలపురం, కల్లివెట్టు గ్రామాల వద్ద కేటీ రోడ్డు ఇరువైపులా ఉన్న చెట్టు పుట్టలను ఆదివారం యువకులు స్వచ్ఛందంగా తొలగించారు. ఆయా గ్రామ యువకులు పలుగు, పార, కత్తి చేత పట్టి పిచ్చిమొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ స్వచ్ఛభారత్, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంటిలో తప్పనిసరిగా మరుగుదొడ్డిని నిర్మించుకోవాలని కోరారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవని తెలిపారు.

ఆత్మ గౌరవ సభ పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

సత్యవేడు: రాష్ట్రంలో దేవాంగులు రాజకీయంగా చైతన్యం కావాలని, రాజకీయంగా బలపడడం ద్వారానే మన సమస్యలు పరిష్కారం అవుతాయని దేవాంగ సంక్షేమ సంఘం మండల ఉపాధ్యక్షుడు మన్నెముద్దు శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన దేవాంగ ఆత్మ గౌరవ సభ పోస్టర్లను నాయకులతో కలసి ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో దేవాంగులు అధికంగా ఉన్న జిల్లాల్లో దేవాంగులకు ఎమ్మెల్యే, ఎంపీ టిక్కెట్లు అన్ని పార్టీల వారు కేటాయించాలని కోరారు. సంఘం మండల కార్యదర్శి యారాశి మురళీకృష్ణ, ఉపాధ్యక్షుడు బండారు మోహన్ బాబు, ఉపాధ్యక్షుడు మన్నెం గణపతి, ఆర్గనైజింగ్ సెక్రటరీలు మన్నెం ఉదయ్‌కుమార్, ఉమ్మిటి బాల గుర్రప్ప(బాబు), జక్కుల శివానంధం, దేవాంగ సంఘం మీడియా ప్రధాన కార్యదర్శి గుర్తి త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాముని కల్యాణ వారోత్సవాలు



కల్యాణోత్సవంలో విశేషాలంకరణ

చిల్లకూరు : అయోధ్యలో బాల రాముని విగ్రహం ప్రతిష్టించిన నేపథ్యంలో ఏపీలోనూ దేవదాయశాఖ ఆధ్వర్యంలో హిందూ ధర్మప్రచార పరిషత్ సహకారంతో తీర ప్రాంతంలోని పలు గ్రామాల్లోని రామాలయాల్లో సీతారాముల కల్యాణ వారోత్సవాలు నిర్వహించనున్నట్టు ఈవో జానకి తెలిపారు. తమ్మినపట్నం పంచాయతీ గుమ్మడిబ్బ మత్స్యకార కాలనీ రామాలయంలో శనివారం రాత్రి అత్యంత వైభవంగా సీతారామ కల్యాణం చేపట్టారు. ఈవో మాట్లాడుతూ వారం రోజులు తీర ప్రాంతంలోని పలు గ్రామాల్లో కల్యాణ మహోత్సవాలు నిర్వహిస్తామన్నారు.



ఎన్నికల శంఖాన్ని పూరిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

వైఎస్సార్ సీపీతోనే సంక్షేమం

- సార్వత్రిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి
- శంఖం పూరించిన ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి
- అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామన్న పార్టీ శ్రేణులు

ఏర్పేడు: 'వైఎస్సార్ సీపీతోనే రాష్ట్రంలో సంక్షేమం సాధ్యం..వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలి.. ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి' అని పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం శ్రీకాళహస్తిలోని పార్టీ కార్యాలయంలో ఏర్పేడు మండల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం జరిగింది. రానున్న ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామని పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతిజ్ఞ చేశారు. ఎమ్మెల్యే 2024 సార్వత్రిక ఎన్నికల యుద్ధానికి శంఖం పూరించి మాట్లాడుతూ గతంలో మొదటిసారి తాను ఓడిపోయినప్పుడు కూడా ఏర్పేడు మండలంలో అత్యధిక ఓట్లు వచ్చాయన్నారు. అలాగే 2019 లో కూడా భారీ మెజారిటీ అందించిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. రానున్న ఎన్నికల్లో కూడా కలిసికట్టుగా పనిచేసి వైఎస్సార్ సీపీకి భారీ మెజారిటీ అందించాలన్నారు. ప్రతిపక్ష పార్టీలు అవాస్తవాలతో ప్రజలకు చేరువకావాలని ప్రయత్నిస్తున్నాయని, వాటిని తిప్పికొట్టాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలతో లబ్ధి పొందిన వాటిని ప్రజలకు వివరించాలన్నారు. మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారం చేపడితే మరిన్ని సంక్షేమ పథకాలను జగనన్న తీసుకు వస్తారని తెలిపారు. రాష్ట్రంలోనే ఎక్కడా లేని అభివృద్ధి శ్రీకాళహస్తి నియోజక వర్గంలో జరిగినట్లు తెలిపారు. తాను ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తున్నానని తెలిపారు. ప్రత్యర్థుల అసత్యాలను సోషల్ మీడియా ద్వారా బహిర్గతం చేయాలని పేర్కొన్నారు. సోమవారం తన కుమార్తె బియ్యపు పవిత్రారెడ్డి ఏర్పేడు మండలం మర్రిమంద గ్రామం నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు తిరుమలయ్య, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్, సింగిల్‌విండో అధ్యక్షుడు జనార్దన్, యాదవ్, మాజీ అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, నాయకులు రామయ్య ఆచారి, అర్జున్‌బాబు, మునిరెడ్డి, మునిరత్నంరెడ్డి, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు

మంత్రి పెద్దిరెడ్డికి ఘన స్వాగతం

శ్రీకాళహస్తి: రాష్ట్ర అటవీ, విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఘనస్వాగతం పలికారు. తిరుపతి నుంచి నెల్లూరుకు రోడ్డు మార్గం గుండా వెళుతున్న ఆయనకు పట్టణంలోని శివం కల్యాణ మండపం వద్ద స్వాగతం పలికారు. ముక్కంటి శాలువాతో సత్కరించి, ప్రసాదాలను అందజేశారు. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



మంత్రి పెద్దిరెడ్డికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

ముక్కంటి సేవలో పొంగులేటి



ఆలయంలో పొంగులేటి సుధాకర్‌రెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం బీజేపీ జాతీయ నాయకుడు, కర్ణాటక, తమిళనాడు కోఇన్‌చార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి దర్శించుకున్నారు. స్థానిక బీజేపీ నాయకులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు ఆయనను ఆశీర్వదించి స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలను అందజేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.ఆనంద్, నాయకులు హరీష్, చందు రాయల్, చైతన్య, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఫరీద్‌బాబాకు సేవా వైభవ్ అవార్డు

రేణిగుంట: రేణిగుంటకు చెందిన జబ్బార్ ట్రస్ట్ అధినేత షేక్ ఫరీద్‌బాబా ఆదివారం సేవా వైభవ్ అవార్డు అందుకున్నారు. తిరుపతి మహతి ఆడిటోరియంలో సర్ సీవీ రామన్ అకాడమీ సేవా సాంస్కృతిక రుద్రాక్ష వైభవం ఆధ్యాత్మిక పీఠం 28వ ఉగాది సంబరాల్లో భాగంగా ఆయన సేవలను గుర్తిస్తూ సేవా వైభవ్ అవార్డును అందజేసి సన్మానించారు.

మహిళా సేవా రత్న అవార్డు

ఏర్పేడు మండలంలోని వికృతమాల లక్ష్మీనరసింహా చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు సైదమ్మకు మహిళా సేవా రత్న అవార్డు లభించింది. ట్రస్ట్ ఆధ్వర్యంలోని 38 మంది ప్రత్యేక ప్రతిభావంతులు, వృద్ధులకు అందిస్తున్న విశిష్ఠ సేవలను గుర్తించి సర్ సీవీ రామన్ అకాడమీ వారు సన్మానించి, అవార్డు, ప్రశంసా పత్రం అందజేశారు.



ప్రశంసాపత్రం అందుకుంటున్న సైదమ్మ



అవార్డు అందుకుంటున్న ఫరీద్‌బాబా

కండలేరులో 11.720 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 11.720 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 260 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ కాలువకు 360 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

త్రీడీ ఎఫెక్ట్ రొంబా సూపర్ డా..!



చంద్రగిరి కోటలో పుదుకుప్పం తమిళ హైస్కూల్ విద్యార్థినీ విద్యార్థులు

- సైన్స్‌సెంటర్‌లో కేరింతలు కొట్టిన పుదుకుప్పం తమిళ విద్యార్థులు
- కొత్త అనుభూతినిచ్చిన విజ్ఞానయాత్ర



సత్యవేడు:''డే..డే.. అంగ్ పార్ డా..అంద పెరియ కాడు పాంబు నంబమేల్‌కు వరుదు..రొంబా భయమా ఇరుక్కుదు..(రేయ్..రేయ్ అది చూడరా ..ఆ కొండ చిలువ మన మీదకు వస్తోంది.. నాకు చాలా భయంగా ఉంది)..''..అని కొందరు ''అమ్మో! మేలిరిందు పెరియ కల్ నంబు మేల్ వుయ్‌రా మరియక్కీదు.. పోయిడలాం ఇంగిరిందు(ఆ పెద్ద గ్రహ శకలాలు మన మీద పడేలా వస్తున్నాయ్..మనం ఇక్కడ నుంచి వెళ్లిపోదాం..)..త్రీ డీ ఎఫెక్ట్ రొంబా సూపర్ దా ..(త్రీడీ ఎఫెక్ట్ భలే ఉన్నాయ్ రా)'' ఇదీ మండలంలోని పుదుకుప్పం తమిళ మీడియం హైస్కూలు విద్యార్థినీ విద్యార్థుల్లో ఒకింత భయం, ఆనందం, ఏదో కొత్త లోకంలో విహరిస్తున్నట్టు..ఊపిరి సలపనివ్వని ఉద్వేగంతో ఊగిపోయిన ఆనంద క్షణాలు. ఈ స్కూలు నుంచి తొలిసారి 75మంది విద్యార్థినీ విద్యార్థులను ప్రత్యేక బస్సులో విజ్ఞాన విహారయాత్రకు తిరుపతి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు టీచర్లు తీసుకెళ్లారు. తొలుత తిరుపతి కలెక్టరేట్, ఆ తర్వాత చంద్రగిరి కోట, జూపార్క్, తిరుపతిలోని సైన్స్ సెంటర్, ఇస్కాన్ మందిరాన్ని సందర్శించారు. ఆయా ప్రాంతాల గురించి టీచర్లు వారికి వివరించారు. జూపార్క్‌లో రకరకాల వన్యప్రాణులను ప్రత్యక్షంగా చూసి కేరింతలు కొట్టారు. ఇవంతా ఒక ఎత్తైతే, సైన్స్‌సెంటర్ మినీ ఆడిటోరియంలో పది నిమిషాల నిడివితో 'అనిమల్ ప్లానెట్' త్రీడీ లఘు చిత్రం చూడడం వారికి సరికొత్త అనుభూతినిచ్చింది. త్రీడీ కళ్లద్దాల ఎఫెక్ట్ వారిని వన్యప్రాణుల మధ్య సంచరిస్తున్నట్టు, గ్రహాంతరయానం చేసినట్టు అనుభూతికి గురై ఉద్వేగంతో తమ విద్యార్థులు కేరింతలు కొట్టారని ఇంగ్లిష్ టీచర్ జగదీష్ చెప్పారు. పట్నం చూడని తమిళనాడు సరిహద్దు మారుమూల ప్రాంతాల విద్యార్థులకు విజ్ఞాన విహారయాత్ర మధురానుభూతులు మిగిల్చింది. టీచర్లు శివ, ఏకాంబరం, మునిబాల, ఆంథోని, వ్యాయామోపాధ్యాయురాలు కె.గ్రేస్‌ప్రతిమ పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా హుస్సేన్ సాహెబ్

పిచ్చాటూరు: పిచ్చాటూరు తహసీల్దార్‌గా హుస్సేన్ సాహెబ్ నియమితులయ్యారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆయన కర్నూలు జిల్లా హోలగుంట నుంచి ఇక్కడికి బదిలీ అయ్యారు. సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు రెవెన్యూ కార్యాలయ అధికారులు వెల్లడించారు.

ఫిట్‌నెస్‌పై అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న తల్లిదండ్రులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని పానగల్ భాష్యం పాఠశాలలో ఆదివారం విద్యార్థుల తల్లిదండ్రులకు ఫిట్‌నెస్‌పై అవగాహన కల్పించారు. ఆటల పోటీలు నిర్వహించారు. ఫిట్‌నెస్ ట్రైనర్ హర్ష, న్యూట్రిషన్ లక్ష్మీ సౌజన్య మాట్లాడుతూ పిల్లలకు కూరగాయలతో పాటు డ్రైఫ్రూట్స్ ఎక్కువగా ఇవ్వడం వల్ల పోషకాలు అందుతాయన్నారు. ప్రతిరోజూ గంట వ్యాయామం చేయాలన్నారు. జేడీవో లక్ష్మణ్, హెచ్ఎం నిరూష, ఉపాధ్యాయులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు అగ్రతాంబూలం

ఏర్పేడు: రాజకీయ పదవుల్లో బీసీలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అగ్రతాంబూలం ఇస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.బాలాజీ రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని సరస్వతికండ్రిగలో ఆయన బీసీలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 11న శ్రీకాళహస్తిలోని శివం కల్యాణ మండపంలో జరిగే బీసీల విజయభేరి సభను విజయవంతం చేయాలని కోరారు.

చిత్తూరుకు వెళ్లి పింఛన్ అందజేత

రేణిగుంట: చిత్తూరుకు వెళ్లి మండలంలోని ఎల్లమండ్యంకు చెందిన లబ్ధిదారుడు నారి జార్జ్‌కు ఆదివారం వలంటీర్ పింఛను అందించారు. జార్జ్ అనారోగ్యంతో గత కొన్ని రోజులుగా చిత్తూరు సమీపంలోని సీఎంసీ ఆస్పత్రిలో చికిత్స పొంది, కుమార్తె ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న వలంటీర్ పూజారి మోహన్ ఆదివారం అక్కడికి వెళ్లి పింఛన్ అందజేశాడు.



జార్జ్‌కు పింఛను అందిస్తున్న వలంటీర్

వాహనదారుడిపై కేసు

ఏర్పేడు: మద్యం సేవించి ద్విచక్ర వాహనాన్ని అతివేగంగా నడపిన ఘటనలో కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీరామ శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. డ్రంకన్ డ్రైవ్‌లో భాగంగా కోబాక రోడ్డు క్రాస్‌లో ఎస్ఐ జిలానీ వాహనాల తనిఖీలు చేస్తుండగా, అతి వేగంగా దిచక్ర వాహనాన్ని నడుపుకుంటూ వస్తున్న వ్యక్తిని ఆపారు. మండలంలోని రాజులపాలెంకు చెందిన హరిగా గుర్తించారు. బ్రీత్ ఎన్‌లైజర్‌తో పరీక్షలు చేయగా మద్యం సేవించినట్లు నిర్ధారించి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఎమ్మెల్యే మధును సత్కరించిన ముస్లింలు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ముస్లిం పెద్దలు

రేణిగుంట: శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి నియోజకవర్గంలోని ముస్లిం మైనార్టీల సంక్షేమానికి ఎంతగానో కృషి చేస్తున్నారని రేణిగుంటకు చెందిన ముస్లిం మైనారిటీ నాయకులు ప్రశంసించారు. ఆదివారం శ్రీకాళహస్తిలో వారు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డిని కలసి శాలువాతో సన్మానించారు. రేణిగుంట ఇస్మాయిల్ మసీదుకు చెందిన షాజహాన్, హబీబ్‌ఖాన్ ఆధ్వర్యంలో ముస్లిం మైనార్టీ నాయకులు ఎమ్మెల్యేను కలసి కృతజ్ఞతలు తెలిపి, తామంతా మీవెంటే అంటూ మద్దతు ప్రకటించారు. పేద ముస్లింల కుటుంబంలో వివాహం జరిగితే మేనమామ సాంగ్యం కింద బీరువా, డబుల్ కాట్ మంచం, టీవీ ఇస్తున్నారని, తద్వారా పేదల ఇంట నిఖ్కా మరింత ఆనందంతో జరుపుకుంటున్నట్లు వివరించారు. రానున్న ఎన్నికల్లోనూ ముస్లింలంతా వైఎస్సార్‌సీపీనే గెలిపిస్తామని స్పష్టం చేశారు. మస్తాన్, ఖాదర్‌బాషు, వలీసాహెబ్, బావాజీ, ఇస్మాయిల్, అబ్దుల్లా, సలాం, ఖాదర్‌వలీ, రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

నేలపై మృత్యు తీగలు



కిందికి వేలాడుతున్న వైర్లు



నేలపై ఉన్న విద్యుత్ వైర్లు

బుచ్చినాయుడుకండ్రిగ: ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యం కారణంగా పొలాల్లో నేలపై విద్యుత్ తీగలు రైతులను భయందోళనకు గురి చేస్తున్నాయి. మండలంలోని తహానగర్, పూసలపల్లి, చిన్నయగుంట గ్రామాల్లోని పొల్లాలో మోటారు విద్యుత్ వైర్లు నెలపైనే ఉన్నాయి. మోటార్ల వద్దకు స్తంభాలను ఏర్పాటు చేయకపోడంతో రైతులు నెలపై విద్యుత్ వైర్లను ఏర్పాటు చేసుకున్నారు. వైర్లు తగిలితే ప్రాణానికే ప్రమాదం ఉంది. అదేవిధంగా కొన్ని చోట్ల వ్యవసాయ మోటార్లకోసం 20 సంవత్సరాలు కిందట విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. వైర్లు స్తంభాలకు ఏర్పాటు చేసి 20 సంవత్సరాలు కావడంతో వదులుగా ఉన్నాయి. వదులుగా ఉన్న విద్యుత్ వైర్లును గట్టిగాలాగి మరమ్మతులు చేపట్టవలసిన ట్రాన్స్‌కో అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు పేర్కొంటున్నారు. ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోక ముందే ట్రాన్స్‌కో అధికారులు స్పందించాలని రైతులు కోరుతున్నారు.

ఆదమరిస్తే అంతే..

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కల్లివెట్టు గ్రామానికి వెళ్లే రోడ్డుపై ఉన్న కల్వర్టుకు యిరువైపుల రక్షణ గోడలు లేకపోవడంతో వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. కల్వర్టు వద్ద పెద్దగొయ్యి ఏర్పాడి ఉండడంతో ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. రక్షణ గోడలు లేకపోవడం, గొయ్యి ఉండడంతో వాహనదారులు ఆదమరిస్తే ప్రమాదాల బారిన పడుతున్నారు. రక్షణ గోడలను నిర్మించాలని పలుమార్లు ఆర్అండ్‌బీ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నా పట్టించుకోలేదని వాహనదారులు అంటున్నారు. ఇప్పటికైనా స్పందించాలని కోరుతున్నారు.



కల్వర్టు వద్ద గొయ్యి

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా..?



పెద్దపాండూరు మార్గంలో రక్షణ గోడలు లేని కల్వర్టు

వరదయ్యపాళెం: మండలంలోని పెద్దపాండూరు–వరదయ్యపాళెం మార్గంలో పాండూరు చెరువు వద్ద కలుజు నీరు వెళ్లే వంతెన వద్ద రక్షణ గోడ లేకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. పెద్దపాండూరు చెరువు నుంచి పంట పొలాలకు సాగునీరు వెళ్లేందుకు ఆర్అండ్‌బీ రోడ్డు మార్గంలో గతంలో పైపు కల్వర్టును నిర్మించారు. కల్వర్టుకు రెండువైపులా రక్షణ గోడ నిర్మాణం చేపట్టలేదు. దీంతో అటువైపుగా వెళ్లే వాహనదారులు తరచూ ప్రమాదానికి గురవుతున్నారు. రెండువైపులా గమనించకలేక పోతుండడంతో ప్రమాదవశాత్తు నేరుగా కాలువలోకి వాహనాలు దూసుకెళుతున్నాయి. ఇదే కల్వర్టు వద్ద ఇటీవల కొయ్యల లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్ ప్రమాదానికి గురై డ్రైవర్ దుర్మరణం చెందాడు. ఇలా అనేక సార్లు ప్రమాదాలు జరిగాయి. దీనిపై ఆర్అండ్‌బీ శాఖ అధికారులు స్పందించి రక్షణ గోడను నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

భవన కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

వరదయ్యపాళెం: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ ఏఐటీయూసీ నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడు అంబాకం చిన్నిరాజ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో భవన నిర్మాణ కార్మికులు సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ 2005లో భవన నిర్మాణ, ఇతర రంగాల కార్మికులకు ఏర్పాటైన సంక్షేమ బోర్డును ప్రస్తుత ప్రభుత్వం బలోపేతం చేయాలని కోరారు. ప్రమాదాలకు గురైన కార్మికులకు బీమా సౌకర్యం, సబ్సిడీపై పరికరాలు పంపిణీ చేయాలన్నారు. సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు కోటేశ్వరరావు, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చంద్రబాబు, సభ్యులు సుబ్రమణ్యం, యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చిన్నిరాజ్

ఘనంగా తపస్య లెర్నింగ్ ఉత్సవ్



లెర్నింగ్ ఉత్సవ్ ప్రారంభంలో ప్రారంభిస్తున్న ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ

రేణిగుంట: రేణిగుంటలోని డాక్టర్ బషీర్స్ తపస్య స్కూల్‌లో లెర్నింగ్ ఉత్సవ్ ఆదివారం ఘనంగా జరిగింది. విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రాజెక్ట్‌లు ఆలోజింపజేశాయి. కార్యక్రమాన్ని తిరుపతి ఐఐటీ డైరెక్టర్ కెఎన్ సత్యనారాయణ ప్రారంభించారు. స్కూల్ అధినేత విక్రమ్ శాలీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని చిన్నారులు ప్రదర్శించిన ఎగ్జిబిట్‌లను పరిశీలించి అభినందించారు. 500మంది విద్యార్థులు 250 ప్రాజెక్టులను ప్రదర్శించారు. విద్యార్థుల తల్లిదండ్రులే కాకుండా స్థానికులు పెద్దసంఖ్యలో విచ్చేసి ప్రాజెక్టులను తిలకించి అభినందించారు. స్కూల్ డైరెక్టర్ కె.అనూష, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

వెంకటగిరి రూరల్ : పట్టణంలోని మనులాలపేటలో రుద్రమూర్తి మఠం ఆలయ పునర్ నిర్మాణానికి ఆదివారం వెంకటగిరి రాజా కుటుంబ సభ్యుడు సర్వజ్ఞకుమారయాచేంద్ర రూ.50 వేల విరాళం ఇచ్చారు. పోతులూరు వీర బ్రహ్మంగారి శిష్యుడైన రుద్రమూర్తి మనులాలపేట ప్రాంతంలో 385 ఏళ్ల క్రితం జీవ సమాధి చెందారు. అక్కడ స్థానికులు ఆలయం నిర్మించారు. ప్రస్తుతం ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో పునర్ నిర్మాణ పనులు చేపట్టారు. అదే విధంగా అనారోగ్యంతో బాధపడుతున్న మల్లమ్మగుడికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కాటబత్తిన చిరంజీవికి ఆర్థిక సాయం చేశారు. వెంకటగిరికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత కాలే చెంచునరసింహారావును పరామర్శించారు. పట్టణ అధ్యక్షుడు జి.ఢిల్లీబాబు, 4వ వార్డు కౌన్సిలర్ ఎంఎ నారాయణ, నేతలు రొంటాల చిన్న, గౌరబత్తిన శివకుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

16 మంది కోడి పందెం రాయుళ్ల అరెస్టు

శ్రీకాళహస్తి : మండలం చిన్నకనపర్తి వద్ద ఆదివారం కోడిపందెం స్థావరాలపై దాడులు నిర్వహించి పోలీసులు 16 మందిని అరెస్టు చేశారు. తొట్టంబేడు ఎస్ఐ రాఘవేంద్ర కథనం మేరకు.. చిన్నకనపర్తి పంటపొలాల్లో కోడిపందెం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందింది. సిబ్బందితో కలిసి కోడిపందెం స్థావరంపై దాడులు నిర్వహించారు. చిన్నకనపర్తి, పెళ్లకూరు, శ్రీకాళహస్తికి చెందిన 16మందిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి నాలుగు కోళ్లు, రూ.3350 నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.